# వైకుంఠం ''క్యూ'' కాంప్లెక్స్ - I

శ్రీ ఈతమాకుల గురవయ్య, తిరుపతి.



శ్రీవేంకటేశ్వస్వామి నివాస స్థానమైన తిరుమల కొండ అత్యంత అద్భుత మైన పుణ్య క్షేత్రము. శ్రీవేంకటేశ్వరస్వామి చరిత్ర గూడ ఆశ్చర్యకరమైనది అద్భుతమైనది.

శ్రీవరాహ పురాణ మున ఇట్లు వర్ణితమై యున్నది.

''వేంకటేశో మహాశ్చర్య
దివ్య చారిత్ర భూషణః
ఆశ్చర్యం తస్య చారిత్రమ్
అద్భుతం పరమాద్భుతమ్.''

తిరుమలకు వచ్చే భక్తులకు శ్రీ వేంకటేశ్వరుని దర్శనార్థమై ఆధునిక వసతులతో శ్రీ వైకుంఠం 'క్యూ' కాంప్లెక్స్ I అను ఒక పెద్ద భవనమును తిరుమల తిరుపతి దేవస్థానం వారు గట్టియున్నారు. ఈ భవనమునందు 30 వేల నుండి 40 వేలమంది భక్తులకు విశ్రాంతి నిచ్చి ఆ పై దర్శనమునకు బంపుచున్న పుణ్య భవన మైనది.

ఈ భవనము క్రీ.శ. 1985 వ సంవత్సరము జనవరి నెల ఒకటవ తేదీన సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లు శ్రీదేవి భూదేవులతో ఈ భవనమునకు వేంచేసి బాజా భజంత్రీలు మ్రోగుచుండ వేదఘోష్ఠి, ప్రబంధ ఘోష్ఠివైదికుల మధ్య జరుగుచుండ ఉద్యోగ బృందములు బారులు తీరి యుండ, భక్త బృందము దర్శనార్థమై వేచి యుండ, శ్రీస్వామివారు ఆ భవనమునకు ప్రారంభోత్సవము గావించిరి.

ఇది జరిగి ఇప్పటికి అనగా క్రీ.శ. 2003 జనవరి ఒకటువతేదీకి 18 సం లు పూర్తి జేసుకొన్నది. '18' అంకె – విజయ సూచిక! గావున, ఈ భవన నిర్మాణము జరిగిన 'స్థలము' మోక్ష ప్రదమైనదిగాన, ఆ స్థల ప్రశస్తికి జెందిన ''గజేంద్ర మోక్షగాధ'' ను స్మరించు కొందము.

ఇంద్రద్యుమ్నుడు అనేకపుణ్య కార్యములు జేసి స్వర్గలోకమునకు పోయెను. కొంతకాలమునకు దేవతలు ''రాజా! నీ పుణ్యము క్షీణించినది. గనుక నీవిక భూ లోకమునకు పొమ్ము'' అని ఆదేశించిరి.

ఇంద్రద్యుమ్నుడు గత్యంతరము లేక భూ లోకమునకు వచ్చి, చిరంజీవి, దీర్ఘాయు ష్మంతుడైన మార్కండేయుని వద్దకు వెళ్ళి ''నన్నెఱుంగుదువా'' యని ప్రశ్నించెను.

మార్కండేయుడు ''నే నిన్ను ఎరుంగను'' అని సమాధాన మిచ్చెను. మరియు ఇట్లనెను.

నాకంటె వృద్ధుడు, పెద్దవాడు ప్రాకర కర్ణుడను గుడ్లగూబ గలదు. ఆ గుడ్లగూబ నడుగుదమని రాజును, మార్కండేయు డును గుడ్లగూబను జేరి ఇంద్రద్యుమ్నుని ఎఱుంగుదువా? యని అడిగిరి.

గుడ్లగూబయు తాను ఎఱుంగనని సమాధానము చెప్పెను.

ఆ గుడ్ల గూబ మరియు ఇట్లనెను. నా కంటె వయోవృద్ధుడు నాళీక జంఘుడను కొంగ గలదు. ఆతనిని

అడుగుదమని వారందరు కొంగను జేరిరి.

కొంగయు నే నెఱుంగను యని సమాధానమిచ్చి నా కంటె వయో వృద్ధుడు ఆకుపారుడు అను తాబేలు గలదు. దాని నడుగుదమని వారందరును తాబేలు కడకు వెళ్ళి మునుపటి వలనే అడిగిరి.

అపుడు తాబేలు ''నిన్ను నే నెఱుంగుదును నీవు ఇంద్రద్యుమ్నుడను రాజువు. నన్ను పెక్కుమారులు రక్షించితివి. నీ వనేక యజ్ఞములు, పుణ్యకార్యములు జేయుటచే దేవతలు నిన్ను స్వర్గలోకమునకు గొనిపోయిరి'' అని సమాధానము చెప్పెను.

ఇంద్రద్యుమ్నుని కీర్తి ఇంకనూ భూలోకములో నుండుట ఎఱింగిన దేవతలు ఆతనిని స్వర్గలోకమునకు తిరిగి తీసికొని పోయిరి.

భాగవతములో ఈ ఇంద్రద్యుమ్నుని మనము జూడగలము. ఇతడు ద్రావిడ దేశాధిపతి యగుటచే దక్షిణ భారతములోని తమిళ దేశమును పాలించిన రాజు.

ఈ ద్రవిడ దేశము ఒకప్పుడు కన్యాకువారి మొదలుకొని ఉత్తరమున శేషాచలము వరకు ప్రాకి యుండెను.

ఒకనాడు అగస్త్య మహాముని ఇంద్రద్యుమ్నుని జూడ, ఆతని సభా మందిరమునకు వేం చేసెను.

మహర్షి రాకను గమనించినను, రాజు తన స్థానమునుండి లేచి అగస్త్యమునిని గౌరవించలేదు.

తనరాకను జూచియు చూడనట్లు ప్రవర్తించుటయేగాక, తన స్థానము నుండి లేవలేని ఆ రాజును ''ఏనుగువై పడి యుండు'' మని శపించి వెళ్ళిపోయెను.

ద్రవిళాధీశుడు, పుణ్యవంతుడు, వైష్ణవ ముఖ్యుడు ఈ ఇంద్రద్యుమ్న మహారాజు మరు జన్మలో ఏనుగై పుట్టి శేషాచల పర్వతములో విహరించుచూ మకరము (మొసలి) చే పట్టుపడి మహావిష్ణువుచే రక్షింపబడిన గజేంద్రుడు.

గజేంద్రమోక్షము ఈ శేషాచల పర్వతము నందే జరిగినది.

ఎంతో పురాణ ప్రసిద్ధి జెందిన ఈ గజేంద్ర మోక్షగుండమునందే నేడు శ్రీవైకుంఠము ''క్యూ'' కాంప్లెక్సు I కట్టబడి తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శనార్థము వచ్చు భక్తులకు విశ్రాంతినిచ్చి దర్శనమునకు బంపు పుణ్య భవనమైనది.

# శరణు శ్రీ వేంకటేశ!



**శ్రీమతి కె. శారద**, తిరుపతి.

అరణమ్ములు, సకల పాప
హరణమ్ములు, దీనజనో
ద్ధరణమ్ములు, వేంకటపతి
చరణ యుగళముల్.

భీషణములు, వైకుంఠుని
భూషణములు, వీర శౌర్య
ఘోషణములు, శేషాచల
శంఖు చక్రముల్.

లక్షణములు, చూడగా
విలక్షణములు, వేడగా
సుభిక్షమొసగు లక్ష్మీపతి
అక్షయకరముల్.

పావనములు, పరమభక్తి
భావనములు, ఒసగుముక్తి
జీవనములు, జలజనాధు
పాద పద్మముల్.

లలితమ్ములు, ప్రేమసుధా
భరితమ్ములు, కటాక్ష సం
భరితమ్ములు, వృషగిరీశు
కన్నుల కాంతుల్.

రంజనములు, భక్తుల హృద
యాంజనములు, సకల పాప
భంజనములు, అంజనాద్రి
పతి నేత్రంబుల్.

మోక్షదములు, శిష్టుల ఎడ
రక్షణములు, దుష్టుల ఎడ
శిక్షణములు, అచ్యుతుని
కటాక్ష వీక్షణల్.

శ్రీ కరములు సిరులిచ్చు
శుభాకరములు, శ్రీలక్ష్మికి
ఆకరములు శ్రీపతి కటి
అభయ హస్తముల్.

చిద్విలాసమున శ్రీహరి
చిరునవ్వులు చిలకింపగ
శ్రీనివాస వేంకటేశ
శీఘ్రగతిని గావు మనుచు.

నారాయణ కీర్తనలను
పారాయణ మొనరించుచు
నరహరినను బ్రోవమనుచు
పడి మ్రొక్కెద నీ మ్రోల

గంగమ్మకు పుట్టిల్లయి
మంగమ్మకు మెట్టిల్లయి
మంగళమగు చరణములకు
మోకరిల్లి యిదె మ్రొక్కెద.

శరణు శరణు వృషగిరీశ
శరణు శరణు హృషీకేశ
శరణు శరణు శ్రీనివాస
శరణు శ్రీ వేంకటేశ.